

పాఠశాలలకు నేటి నుంచి సంక్రాంతి సెలవులు

సాలూరు రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు ఈ నెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. సంక్రాంతి పండగ అనంతరం ఈ నెల 20న బడులు పునః ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఉన్న 1,789 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ సెలవులు వర్తించనున్నాయి. కాగా సంక్రాంతి సెలవుల నేపథ్యంలో జిల్లాలో ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులు గురువారం ఎంతో సరదాగా ఇంటి బాట పట్టారు. మరికొందరు తల్లిదండ్రులతో కలిసి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

సంక్రాంతి సంబరాలు



భామిని ఆదర్శ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయ బృందం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శుక్రవారం నుంచి పండగ సెలవుల నేపథ్యంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలతో అలరించారు. సంప్రదాయ వస్త్రధారణలతో అందర్నీ ఆకట్టుకున్నారు. భోగి మంటలు వేస్తూ ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. మొత్తంగా అంతటా సందడి వాతావరణం నెలకొంది.

- పూర్తి వివరాలు 4వ పేజీలో...

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం



సాలూరు పెదకోమటిపేట రామాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

జిల్లాలో వైష్ణవాలయాలు వైకుంఠ ఏకాదశికి ముస్తాబయ్యాయి. ప్రత్యేక పూజలు, అర్చనలకు సిద్ధమయ్యాయి. మరోవైపు నిర్వాహకులు ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేకంగా క్యూలైన్లు సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి స్వామి దర్శన భాగ్యం కల్పించనున్నారు. జిల్లాలో తోటపల్లి దేవస్థానంతో పాటు ప్రముఖ దేవాలయాల్లో వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

- పూర్తి వివరాలు 4వ పేజీలో...

అటవీ సంరక్షణ ఎలా?

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఉన్న ఉద్యోగులపై అదనపు భారం
- కొరవడుతున్న పర్యవేక్షణ
- రిజర్వ్ ఫారెస్ట్‌లో ఆక్రమణలు
- స్పందించేవారే కరువు

జియ్యమ్మవలస, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటవీ శాఖకు సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. భారీగా పోస్టులు ఖాళీ ఉన్నా కొన్నాళ్లుగా నియామకాలు చేపట్టడం లేదు. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. మరోవైపు అడవులపై పర్యవేక్షణ కొరవడుతోంది. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో భూములు అన్యాక్రాంతమవుతున్నా.. విలువైన అటవీ సంపద తరలిపోతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. వాస్తవంగా జిల్లాలో అడవుల విస్తీర్ణం 3,659 చదరపు కిలో మీటర్లు. 1,02,784 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. మొత్తంగా 30 శాతం అడవులు ఉన్నాయి. వాటి పరిరక్షణకు సాలూరు, పార్వతీపురం, పాలకొండ, కురుపాం అటవీశాఖ రేంజ్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, మొండెంఖల్, కొమరాడ, పార్వతీపురం, వీరఘట్టాం, పాలకొండ, కొత్తూరు, సరుబుజ్జిలి, సాలూరు, మక్కువ, మామిడిపల్లి, పాచిపెంట సెక్షన్లు ఉన్నాయి. మొత్తంగా 53 బీట్లు కూడా ఉన్నాయి. అయితే పూర్తిస్థాయిలో సిబ్బంది మాత్రం లేరు.

సిబ్బంది ఇలా..

అడవులపై పర్యవేక్షణ చాలా అవసరం. దీనికోసం ప్రతి రేంజ్‌కు ఒక అధికారి, సెక్షన్ ఆఫీసర్, ప్రతి సెక్షన్ పరిధిలో ఒక్కో బీటుకు ఫారెస్టు ఆఫీసర్, అసిస్టెంట్ బీటు ఆఫీసర్ కచ్చితంగా ఉండాలి. జిల్లాలో నాలుగు రేంజ్‌లు, 13 సెక్షన్లు, 54 బీట్లు, రెండు తానాదార్‌లు ఉండాలి. నిబంధనల ప్రకారం నలుగురు రేంజ్‌లు, 13 మంది సెక్షన్ ఆఫీసర్లు, 54 మంది బీటు ఆఫీసర్లు, 53 మంది అసిస్టెంట్ బీటు ఆఫీసర్లు ఉండాలి. జిల్లాలో చూసుకుంటే నలుగురు రేంజర్లు ఉన్నారు. పాలకొండ, పార్వతీపురం, సాలూరు రేంజ్ పరిధిలో కావల్సిన సెక్షన్ ఆఫీసర్లు ఉన్నారు. కురుపాం రేంజ్ పరిధిలో ముగ్గురు సెక్షన్ ఆఫీసర్లకు ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన రెండు సెక్షన్లకు ఆయనే ఇన్‌చార్జిగా కొనసాగుతుండడం వల్ల అదనపు పనిభారంతో సతమతమవుతున్నారు. 54 ఫారెస్ట్ బీట్లుకు సంబంధించి 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 53 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లకు గాను కేవలం 11 మంది మాత్రమే ఉన్నారు. దీంతో అడవులపై పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. సాలూరు రేంజ్ పరిధిలో పి.కోనవలస చెక్‌పోస్టుకు తానాదార్ లేరు. పాలకొండ రేంజ్‌లో యాలం చెక్‌పోస్టుకు తానాదార్ ఉన్నారు. కురుపాం రేంజ్‌లో సీనియర్ అసిస్టెంట్ పోస్టు కూడా భర్తీ చేయలేదు.



కురుపాం అటవీశాఖ రేంజ్ కార్యాలయం

రేంజ్ పేరు	సెక్షన్లు	పనిచేసిన వారు	బీట్లు	ఫా.బీ.ఆ.	అ.బీ.ఆ	తానాదార్‌లు
కురుపాం	3	1	15	9	2	చెక్‌పోస్టు లేదు..
పార్వతీపురం	2	2	11	8	6	చెక్‌పోస్టు లేదు..
సాలూరు	4	4	13	11	--	పోస్టు ఖాళీ
పాలకొండ	4	4	14	13	3	1
మొత్తం	13	11	53	41	11	1

అటవీ భూములు అన్యాక్రాంతం..

అడవులపై పూర్తి పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఏటా వాటి విస్తీర్ణం తగ్గిపోంతోది. ఇప్పటికే కొంతమంది భూస్వాములు ఎక్కడికక్కడ చెట్లు, పొదలను కొట్టి చదును చేసుకుంటున్నారు. జీడి, మామిడి, తదితర మొక్కలు నాటి కొందరు అధికారులు, సిబ్బంది సహకారంతో పట్టాలు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో అటవీ హక్కు చట్టానికి తూట్లు పడుతున్నాయి. అడవుల్లో ఉండాల్సిన వన్య ప్రాణులు పల్లపు ప్రాంతాలకు వచ్చి వేటగాళ్ల చేతుల్లో మృత్యువాత పడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం సిబ్బంది కొరతే. అడవుల పర్యవేక్షణకు అవసరమైన సిబ్బంది లేకపోవడం, ఉన్న ఉద్యోగులపై అదనపు పనిభారం పడడంతో సక్రమంగా విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఏర్పడింది. చివరికి ఏనుగుల కదలికల విషయంలో ట్రాకర్స్‌పై ఆధారపడాల్సి వస్తోంది. ఇదంతా అటవీశాఖకు తెలిసినప్పటికీ పోస్టుల భర్తీ విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది..

అటవీశాఖలో పోస్టుల భర్తీ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. వారు తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం మాకున్న సిబ్బందితో విధులు నిర్వర్తిస్తున్నాం.

- డి.గంగరాజు, ఫారెస్ట్ రేంజర్, కురుపాం

ఇది రైల్వే బాదుడు!

- ప్రీమియం తత్కాల్ పేరిట వడ్డన
- పండుగ, పర్వదినాల్లో అదేతంతు
- రద్దీ మార్గాలంటూ కొత్త నినాదం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

బొబ్బిలి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అవసరాన్ని రైల్వే అలుసుగా తీసుకుని బాదుడుకు దిగుతోంది. పండుగలు, ప్రత్యేక పర్వదినాలు, రద్దీగా ఉన్న రూట్ల పేరు చెప్పి దండిగా వసూలు చేస్తోంది. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ నడుస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి, కోల్‌కతా నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ఇది మంచిదే అయినా.. ప్రీమియం తత్కాల్, తత్కాల్ పేర్లతో అదనపు వసూళ్లకు దిగుతుండడాన్ని అందరూ తప్పుబడుతున్నారు.

వెయిటింగ్ లిస్టు చూపి..

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖకు ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. ఈ రెండు రూట్ల మధ్య త్రీటైర్ ఏసీ టిక్కెట్ ధర అక్షరాలా రూ.770. అయితే ముందస్తు బుకింగ్‌లో భాగంగా రైల్వే అధికారిక వెబ్‌సైట్ ఐఆర్‌సీటీసీలో వెయిటింగ్ లిస్టు చాంతాడు ఉంది. దాని పక్కనే టిక్కెట్ ధర రూ.1800 నుంచి రూ.2000 వరకూ ఉంటోంది. 80 శాతం కన్ఫర్మ్ అయ్యే చాన్స్ ఉంటుందంటూ చెబుతోంది. బస్సుల్లో అంతకంటే ఎక్కువ టిక్కెట్ ధర ఉండడంతో ఇట్టే బుక్ చేస్తున్నారు. ఇక ఫస్ట్ క్లాస్ ఏసీ, టూటైర్ ఏసీ టిక్కెట్ల విషయంలో ముందస్తు బుకింగ్ చేసుకుంటూ మూడింతలు అదనంగా వసూలు చేస్తున్నారు. కొంతకాలంగా రైల్వేశాఖలో సేవాభావం తగ్గింది. పూర్తిగా వ్యాపార ధోరణిలోకి మారిపోయినట్టు కనిపిస్తోంది. ఆదాయం తక్కువ వస్తున్నాయని చెప్పి ప్యాసింజర్ రైల్ సర్వీసులను నిలిపివేసింది. కొవిడ్ తరువాత దాదాపు సూపర్ ఫాస్టు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పెంచిన రైల్వే శాఖ ప్యాసింజర్ల విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. వందేభారత్ వంటి బుల్లెట్ రైళ్లు ప్రవేశపెట్టామని చెబుతున్న రైల్వేశాఖ.. అందులో గ్రామీణులు ఎంతవరకు రాకపోకలు సాగిస్తున్నారన్నది మాత్రం గుర్తించడం లేదు.



రూ.497.96 కోట్లతో అంచనా బడ్జెట్

- జడ్పీ సమావేశంలో ఆమోదించిన సభ్యులు
- జలాశయాల వద్ద విగ్రహాల ఏర్పాటుకు నిర్ణయం

5లో



జేఎన్‌టీయూ క్రికెట్ జట్టు ఎంపిక

4లో

టీడీపీ శాశ్వత సభ్యులుగా అశోక్, అదితి గజపతిరాజు

నిరంతర పర్యవేక్షణ ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు

6లో

గిరిజనులకు ఊరట

- పెరిగిన అటవీ ఉత్పత్తుల ధరలు
- వెల్లడించిన జీసీసీ

పార్వతీపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల నుంచి నేరుగా అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి.. వారికి గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఆదేశాలు జారీ చేయడంతో గిరిజన కార్పొరేషన్ సంస్థ (జీసీసీ) అటవీ ఉత్పత్తుల ధరలను పెంచింది. గత ఏడాది కంటే ధరలు పెరగడంతో గిరిజనులకు కాస్త ఊరట కలగుతుందని చెప్పొచ్చు. ఇకపై వారు దళారులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

గత ఏడాది ఇలా..

గత ఏడాది పిక్కతో కూడిన కిలో చింతపండు ధర రూ.32-40పైసలు, పిక్కతీసిన చింతపండు రూ.63, కాగుపప్పు రూ.22, విప్పపప్పు రూ.29, కొండతామర జిగురు రూ.114 , ముసిడిక పిక్కలు రూ.90, కరక్కాయలు రూ.18, ఎండు ఉసిరిక పప్పు రూ.80, ఇండికా పిక్కలు రూ.50, కానీ కాయలు రూ. 17, కుంకుడుకాయలు రూ.35, సీకా కాయి రూ.40, అడవి తేనె రూ. 250, పుట్ట తేనె రూ. 160, తేనె మైనం రూ.160, కొండ చీపుర్లు గ్రేడ్-1 రూ.45.

తాజాగా పెరిగిన రేట్లు ప్రకారం...

పిక్కతో ఉన్న కిలో చింతపండు రూ.34, పిక్కతీసిన చింతపండు రూ.67, కాగుపప్పు రూ.25, విప్పపప్పు రూ.32, ముసిడిక పిక్కలు రూ.వంద, నల్లజీడి పిక్కలు రూ.22, కరక్కాయలు రూ.20 , ఎండు ఉసిరిక పప్పు రూ.90, కానీ కాయలు రూ.18కు పెంచారు. మిగిలిన అటవీ ఉత్పత్తుల రేట్లలో ఎలాంటి మార్పు లేదు. గత సంవత్సరంతో పోల్చుకుంటే చింతపండుకు పిక్కతో ఉన్న దానికి రూ.రెండు, పక్కి తీసిన దానికి రూ.నాలుగు పెంచారు. చింతపండు, మిగిలిన అటవీ ఉత్పత్తులను గిరిజనుల నుంచి నేరుగా జీసీసీ కొనుగోలు చేస్తేనే లక్ష్యాలు నెరవేరే అవకాశం ఉంది.గిరిజన రైతులకు కూడా ఎంతోకొంత గిట్టుబాటు అవుతుంది. దీనిపై జీసీసీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

ధరలపై అవగాహన

మక్కువ: మొండంగి గ్రామంలో గురువారం గిరిజనులకు జీసీసీ ధరలు, అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై అవగాహన కల్పించారు. దళారులకు విక్రయిస్తే నష్టపోతారని, జీసీసీకి అమ్మితే గిట్టుబాటు ధర లభిస్తుందని వివరించారు. అనంతరం ధరల పట్టికను ప్రదర్శించారు. ఈ కార్య క్రమంలో జీసీసీ బ్రాంచి డైరెక్టర్ నూకమ్మ, సర్పంచ్ గంగమ్మ, సేల్స్‌మన్ ఎస్.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు చేస్తాం

జీసీసీ ద్వారా గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తాం. ఈ ఏడాది రెట్లు పెరిగాయి. ఈ విషయాన్ని గిరిజన రైతులకు తెలియజేస్తాం. వారికి మేలు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

- ఉరిటి మహేంద్ర, డివిజనల్ మేనేజర్, జీసీసీ



సీతంపేట ఐటీడీఏలో జీసీసీ డీఎం కార్యాలయం

పేదల కోసం స్వయం ఉపాధి పథకాలు: కలెక్టర్



పార్వతీపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు, బీసీ, అగ్రవర్ణాల్లో పేదల కోసం స్వయం ఉపాధి పథకాల కింద యూనిట్ల స్థాపించనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. డీ, బీ ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత జనరిక్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా సబ్సిడీతో బ్యాంకు రుణాలు అందిస్తామన్నారు. వెనుకబడిన తరగతుల వారి కోసం శ్లాబ్- 1,2,3 కింద 1,221 యూనిట్ల స్థాపనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉండగా 50 శాతం వరకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. 25 జనరిక్ ఫార్మసీల ఏర్పాటు లక్ష్యం కాగా ఒక్కో యూనిట్ విలువ రూ.8 లక్షలని చెప్పారు. ఇందులో రూ.4 లక్షలు సబ్సిడీ ఉంటుందన్నారు. అర్హులైన వారు సచివాలయాల్లో లేదా ఇంటర్నెట్ సెంటర్‌లో ఈ నెల 16లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లను సంప్రదించాలన్నారు.

వీడీవీకేలపై ప్రత్యేక దృష్టి: ఇన్‌చార్జి పీవో

పార్వతీపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని వన్‌ధన్ వికాస్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. వన్‌దన్ వికాస్ కేంద్రాల పనితీరు, వాటి ద్వారా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వీడీవీకేల్లో జీడిపప్పు కొనుగోలు చేసి గుమ్మలక్ష్మీపురం, సాలూరులో ఉన్న ప్రాసె సింగ్ సెంటర్ల ద్వారా వాల్యూయేషన్ చేయించాలని సూచించారు. అధిక లాభాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

తీరంలో చలిపులి



చలి మంట వద్ద చిన్నారులు...

విజయనగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో చలి పులి వణికిస్తోంది. తీరంలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని 12 గ్రామాల్లో చలి గాలుల తీవ్రత ఇటీవల అధికమైంది. ఓ పక్క చలిగాలులు, మరోవైపు మంచుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, బాలింతలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో చలిమంటలతో ఉపశమనం పొందుతున్నారు. ఉదయం 10.45 గంటల వరకు జాతీయ రహదారి 16లో మంచు అధికంగా కురియటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని వాహనదారులు, లారీ, బస్సుల డ్రైవర్లు వాపోతున్నారు. చలి, మంచు ప్రభావంతో జలుబు, దగ్గు తదితర వ్యాధులతో పాటు.. ఉబ్బసం ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



తీర గ్రామంలో చలి నుంచి రక్షణకు ఇలా...



భోగాపురం వద్ద జాతీయ రహదారిపై మంచు

ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం

- రామతీర్థంలో ఉత్తర ద్వార దర్శనం నేడు
- గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి



బొబ్బిలి: పూలమాలలు సిద్ధం చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల/పార్వతీపురం టౌన్/బొబ్బిలి/సాలూరు రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి వేడులకు జిల్లాలోని వైష్ణవాలయాలు సిద్ధమయ్యాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీరామస్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. ఈ మేరకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉత్తర గోపురం గుండా దేవాలయంలోనికి భక్తులు ప్రవేశించేందుకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. ప్రముఖులకు కూడా మరో క్యూలైన్ ఏర్పాటుచేశారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఈఓ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పల్లకిలో సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ఉంచుతారు. స్వామి వారిని దర్శించుకుని పల్లకి కిందనుంచి ఆలయంలోనికి ప్రవేశించి గర్భగుడిలోని ధ్రువమూర్తులను భక్తులు దర్శించుకోనున్నారు. ఉదయం 7 గంటల తర్వాత సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను పల్లకితో రామతీర్థం ప్రధాన వీధుల్లో ఊరేగిస్తారు. విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో పాటు సాలూరు, పాలకొండ తదితర ప్రాంతాలలోని వైష్ణవాలయాల్లోనూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.



నెల్లిమర్ల: రామతీర్థంలోని సీతారామలక్ష్మణుల విగ్రహాలు

గిరి ప్రదక్షిణ నేడు..

రామతీర్థం దేవస్థానం పక్కనే ఉన్న నీలాచలం (బోడి కొండ) చుట్టూ గిరి ప్రదక్షిణకు నిర్వాహకులు ఏర్పా ట్లు పూర్తి చేశారు. ఏటా (ముక్కోటి) వైకుంఠ ఏకాదశి రోజున సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీనివాసానంద సరస్వతి వెల్లడించారు.



సాలూరు రూరల్: పెదకోమటిపేట రామాలయంలో ఇలా...



పార్వతీపురం టౌన్: శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూవులు సిద్ధం చేస్తూ..




క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియకు హాజరైన క్రీడాకారులు, అధ్యాపకులు

జేఎన్‌టీయూ క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియను గురువారం ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ పోటీలను యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ, రఘు కలిదిండి ప్రారంభించారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. త్వరలో జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో వర్సిటీకి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. ఎంపికైన జట్టు ఈ నెల 16 నుంచి 21 వరకూ యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటుంది. ఈ ఎంపిక ప్రక్రియలో సీహెచ్ శ్రీనివాసులు, డాక్టర్ జి.సూర్యనారా యణరాజు, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ రామకృష్ణ, పీవీ రమణ, వ్యాయామ పీడీ డాక్టర్ టి.ప్ర సాద్, సీహెచ్ రవి, ఎంఎన్ శ్రీనివాస్, రజనీ కాంత్, బాలాజీ, మహేష్, బంగార్రాజులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యులుగా అశోక్, అదితి గజపతిరాజు





విజయనగరం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు గురువారం తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఇద్దరూ చెరో రూ.లక్ష చొప్పున పార్టీకి చెల్లించి.. శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా కార్యకర్తలకు బీమా సౌకర్యంతో పాటు, వారి సంక్షేమం కోసం కూడా పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది నుంచి శాశ్వత సభ్యత్వానికి అవకాశం కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు ఈ సభ్యత్వాన్ని తీసుకున్నారు.

సంక్రాంతి సంబరాలు

- పాఠశాలలు, కళాశాలల్లో ముందే వేడుకలు
- సంప్రదాయ వేషధారణలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



బాడంగి: బాడంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో భోగి మంటలు

ప్రభుత్వ పాఠశాలలు... జూనియర్, డిగ్రీ కళాశాలలు గురువారం సంక్రాంతి సంబరాలకు వేదికలయ్యాయి. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ వేడుకలను నిర్వహించారు. హరిదాసులు... డూడూ బసవన్నలు... ఎడ్ల బండ్లు... భోగి మంటలు... జంగమయ్యల వేషధారణలతో విద్యార్థినీ విద్యార్థులు ఆకట్టుకున్నారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలను రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు అచ్చ తెలుగు సంప్రదాయ దుస్తులతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్నిచోట్ల కోలాటం, జానపద గీతాల వంటివి ప్రదర్శించగా... మరికొన్ని చోట్ల గాలిపటాలు ఎగురవేస్తూ పిల్లలు సందడి చేశారు. సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.



కురుపాం: ఆదర్శ పాఠశాలలో భోగి మంటలు



సాలూరు రూరల్: కూనంబందవలస పాఠశాలలో...



వీరఘట్టం: నడుకూరులో భోగి మంట వద్ద విద్యార్థులు



డెంకాడ: అక్కివరం మోడల్ స్కూల్‌లో..



లక్కవరపుకోట: శ్రీరాంపురంలో..



సంతకవిటి: సంప్రదాయ దుస్తులతో సిరిపురం పాఠశాల విద్యార్థులు



గుమ్మలక్ష్మీపురంలో..



బొబ్బిలి రూరల్: నారసింహునిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంబరాలు

జాతీయస్థాయి పోటీలకు కొత్తవలస విద్యార్థిని



పుష్పిత

కొత్తవలస, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో 9 వతరగతి విద్యార్థిని కె.పుష్పిత జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం సీహెచ్ ఈశ్వరరావు తెలిపారు. డిసెంబరులో జరిగిన అండర్-15 పోటీలలో భువనేశ్వర్, రాజస్థాన్, పంజాబ్ జట్లతో జరిగిన పోటీలలో మూడు మ్యాచ్‌లలోను 252 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలబడిందన్నారు. అండర్-17 పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున ఆడేందుకు ఎంపికైనట్టు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పుష్పితను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు, రవాణా, జాతీయ రహదారులు సంస్థలతో కలిసి పకడ్బందీ చర్యలు చేపడతామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఆయా రహదారులపై తరుచూ జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదాలకు గల కారణాలను శాస్త్రీయంగా అంచనా వేసి వాటిని నివారించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చర్యలు చేపడతామన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు సాయమందించేందుకు ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలపై నమోదైన కేసులు వివరాలను, ఏ ప్రాంతాల్లో అధికంగా నమోదవుతున్నాయనే అంశాలపై ఆరా తీశారు. గొట్లాం వద్ద జాతీయ రహదారి కూడలిలో తగిన వెలుతురు లేకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతుందని అధికారులు తెలిపారు. గుర్తుతెలియని వాహనాలు ఢీకొని గాయపడినా, మరణించినా బాధితులకు నెల రోజుల్లోగా పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో నలుగురు బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు ఆమోదించారు. అనంతరం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలపై రూపొందించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. అదనపు ఎస్పీ సౌమ్యలత, డీఆర్వో శ్రీనివాసమూర్తి ఆర్డీవోలు రామ్మోహన్, సత్యవాణి, కీర్తి తదితరులున్నారు.

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

విజయనగరం, కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈనెల 19 వరకూ సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి ఈనెల 20న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

నేడు ఎస్.కోటలో విద్యుత్ అంతరాయం

శృంగవరపుకోట జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఆర్.రవికుమార్ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామనగర్, సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపం, ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్-1 నుంచి 6 లైన్లు, బంగారమ్మ లే-అవుట్, మల్లిపూడి స్టోన్ క్రషర్, శిరికి రిసార్ట్, విశాఖ డెయిరీ, ఆర్.కె. కల్యాణ మండపం, మంతాజ్ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

సింహాద్రి అప్పన్నకు పల్లకి సేవ



పల్లకి సేవలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోట పట్టణంలో గురువారం సింహాద్రి అప్పన్నకు పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. ఇలాంటి దైవకార్యక్రమాలు చేపట్టడం వల్ల భక్తితో పాటు ఐకమత్యం ఏర్పడుతుందని, నిర్వాహకులను ఆమె అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జి.ఎస్. నాయుడు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్ తదితరులున్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోండి

వంగర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో మడ్డువలస ఆయకట్టు రైతులు సాగునీటిని పొదుపుగా వాడాలని మడ్డువలస ఏఈ అనిల్ కోరారు. గురువారం మడ్డువలస రిజర్వాయర్ ప్రధాన గేట్లకు ఆయన పూజలు నిర్వహించిన అనంతరం కుడి కాలువ ద్వారా నీరు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుడి కాలువ పరిధిలోని 6 మండలాల్లో 30 వేల ఎకరాలకు విడతల వారీగా నీరు విడుదల చేస్తామన్నారు. ఆరుతడి పంటలను మాత్రమే సాగుచేయాలన్నారు. ముందుగా వచ్చిన నీరు చెరువులకు తరలించి నిల్వ చేసుకోవాలన్నారు.

పేదలకు న్యాయం చేయండి

విజయనగరం దాసన్నపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దాసన్నపేట ఎర్రచెరువు పేదలకు న్యాయం చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం చేయాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచెరువు గర్భంలో ఉన్నవారు ఖాళీ చేయాలని కమిషనర్ నల్లనయ్య నోటీసులు జారీ చేడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పేదల ఇళ్లు చెరువు గర్భంలో లేవని, వీరికి ప్రభుత్వమే పట్టాలు ఇచ్చిందన్నారు. అక్కడ కట్టిన ఇళ్లన ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి రమణమ్మ, నాయకులు ఆది, చంటి, సాయి, సూరిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ

విజయనగరం రింగురోడ్డు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సర్వీసు ప్రొవైడర్ల ద్వారా అమలవుతున్న విధానాలను అందరూ వినియోగించుకోవాలని మెప్మా పీడీ చిట్టిరాజు అన్నారు. గురువారం ప్రభుత్వ సంస్కృత కళాశాలలో నిర్వహించిన సర్వీసు ప్రొవైడర్స్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక విధానాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో సర్వీసు ప్రొవెడర్లకు వినూత్నమైన శిక్షణ ఇస్తోందన్నారు. విద్యుత్ గృహోపకరణాల మరమ్మతులు చేసేవారికి, బ్యూటీషియన్ కోర్సు చేసేవారికి మరింత తర్ఫీదు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సమావేశంలో టీపీఆర్‌వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజరు సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి సాగునీటి సమస్యలు

రేగిడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని సంకిలి నీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు అన్నారు. సాయన్న చానల్ ఆయకట్టుదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. త్వరలో ఇరిగేషన్ శాఖ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

రూ.497.96 కోట్లతో అంచనా బడ్జెట్

- జలాశయాల వద్ద విగ్రహాల ఏర్పాటుకు నిర్ణయం
- జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పింఛన్లపై ఆందోళన వద్దు : కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్



జడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం/టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 497.96 కోట్లతో జిల్లా పరిషత్ అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. గురువారం స్థానిక జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో జలాశయాల నిర్మాణానికి కృషి చేసిన మహనీయుల పేర్లు పెట్టి, భావితరాలకు వారి సేవలను గుర్తు చేయాలనుకోవడం గొప్ప విషయమన్నారు. ఆయా జలాశయాల వద్ద వారి విగ్రహాలను ఏర్పాటు చేసి పార్కులను నిర్మిస్తే వారికి సముచితమైన గుర్తింపు ఇచ్చినట్టవుతుందన్నారు. తోటపల్లి ప్రాజెక్టుకు గౌతు లచ్చన్న, జంఝావతికి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు, మడ్డువలసకు గొర్లె శ్రీరాములునాయుడు, తాటిపూడి జలశయానికి గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరును పెట్టడం సముచితమన్నారు. ●జిల్లాలో వికలాంగుల పింఛన్లను అనర్హుల పేరిట తొలగిస్తున్నారని, ప్రజల్లో భయాందోళనలు రేకెత్తుతున్నాయని జడ్పీ చైర్మన్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందిస్తూ పింఛన్ల తొలగింపుపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని, వాటిపై అపోహలు వద్దన్నారు. ప్రస్తుతం రీ-వెరిఫికేషన్ మాత్రమే జరుగుతోందన్నారు. ● తాటిపూడి జలాశయంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోటు షికారుకు అన్ని అనుమతులు ఉన్నాయా, పర్యాటకుల భద్రతకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని జడ్పీ చైర్మన్ జలవనరులు, పర్యాటక శాఖల అధికారులను ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బోటు షికారుకు అన్ని అనుమతులు ఉన్నాయని, పర్యాటక కార్పొరేషన్, బోటు నడిపే కంపెనీ ఒప్పందం చేసుకున్నాయ న్నారు. భద్రత, ధర, ఇతర అంశాలపై చర్చించి, నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ● వైద్య, ఆరోగ్యశాఖ సమీక్షలో భాగంగా హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందుతున్నారని సభ్యులు తెలపగా, రాష్ట్రంలో ఒక్క కేసు నమోదు కాలేదని, అయితే ప్రభుత్వం నుంచి అలర్ట్ వస్తున్నాయని కలెక్టర్ బదులిచ్చారు. కోవిడ్‌లో తీసుకునే జాగ్రత్తలు తీసుకోవాలని, శీతాకాలంలో వచ్చే వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాస్క్ ధరించాలని, శానిటైజర్ వినియోగించాలన్నారు. ●ఉపాధి పనులు పంచాయతీల తీర్మానం లేకుండా చేస్తున్నారని, చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని, అవినీతి జరుగుతోందని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులన్నీ నిబంధనలు మేరకే జరుగుతున్నాయని, చెల్లింపులు సక్రమంగా చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై అవినీతి ముద్ర వేయడం మంచిది కాదని, ఎక్కడైనా జరిగితే స్పష్టంగా, వివరంగా రాసి ఇస్తే విజిలెన్స్ విచారణ చేపడతామన్నారు. ●మామిడి పంట ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వం నిర్ణయించిన రూ. 2 వేలు ప్రీమియం తగ్గించాలని, బీమా గడువు పెంచాలని జడ్పీ చైర్మన్ తీర్మానం చేసి పంపాలని కోరారు. ప్రజలకు తెలిసే సమయానికే గడువు అయిపోతుందని సభ్యులు ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి లేఖ రాస్తానని తెలిపారు. సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్సీలు డాక్టర్ పి.సూర్యనారాయణరాజు, ఐ.రఘురాజు, జడ్పీ సీఈవో సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నియామక ప్రక్రియ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం ఎనిమిదవ రోజు పోలీసు కానిస్టేబుల్స్ ఉద్యోగాల నియామక ప్రక్రియ కొనసాగింది. ఎస్పీ వకుల్ జిందాల్ ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావు ప్రక్రియను పర్యవేక్షించారు. 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావల్సి ఉండగా 375 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. 5 గంటల నుంచే ప్రక్రియ ప్రారంభమైంది. అభ్యర్థులకు ముందుగా హాల్‌టిక్కెట్లు పరిశీలించి గ్రౌండ్‌లోకి అనుమతించారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఎక్విప్‌మెంట్స్‌ని వినియోగించారు. పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని ప్రక్రియ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు. ఈ ప్రక్రియలో డీఎస్పీలు వీరకుమార్, యూనివర్స్ బాపూజీ, శ్రీనివాసరావు, థామస్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, పీఈటీలు పాల్గొన్నారు.

నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయనగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. గురువారం సింగపూర్ సిటీ, ప్రశాంతినగర్, దాసన్నపేట ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రశాంతినగర్‌కు తాగునీరు సరఫరా కావడంలేదని ఫిర్యాదు చేయడంతో సబస్యను పరిష్కరించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. రహదారులపై అనధికార నిర్మాణాలను గమనించిన ఆయన తక్షణమే వాటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్.తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అంగీకార పత్రాలు



అంగీకార పత్రాలను చూపిస్తున్న యువత

చీపురుపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని చీపురుపల్లి పట్టణంలోని కొంత మంది యువత ముందుకొచ్చారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు వారికి గతంలో అవగాహన కల్పించడంతో, గురువారం వారంతా అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. పత్రాలపై సంతకాలు చేసిన వారిలో ముత్తా కల్యాణ్, మండల చైతన్య, శేషపు సాయి, పెద్ది వెంకటేష్, బి.సాయిరెడ్డి, పి.నందిని తదితరులున్నారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ ఒక వ్యక్తి దానం చేసిన అవయవాలు మరో 13 మందికి ప్రాణం పోయడం ఎంతో సంతోషమన్నారు. కార్యక్రమంలో మానవీయత ప్రతినిధులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు



మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

వంగర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస కళాశాలలో మరుగుదొడ్లకు మరమ్మతులు మొదలయ్యాయి. తాగునీటి కల్పనకూ చురుగ్గా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'తాగునీరు లేదు.. మరుగుదొడ్లు లేవు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ అంబేడ్కర్ స్పందించారు. కళాశాలలో మౌలిక సదుపాయలపై డీవీఈవో వివరణ కోరారు. దాంతో ఆయన మడ్డువలస కళాశాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించడంతో గురువారం మరమ్మతులు ప్రారంభించారు.

రెవెన్యూ దరఖాస్తులపై ఆడిట్ చేస్తాం

విజయనగరం కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిష్కరించాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ తహశీల్దార్ పరిష్కరించిన ప్రతి దరఖాస్తును ఆడిట్ చేస్తామన్నారు. సదస్సుల్లో 6846 దరఖాస్తులు రాగా, వీటిల్లో 4924 దరఖాస్తులు రెవెన్యూకు సంబంధించినవేనన్నారు. ఈ దరఖాస్తులను పరిష్కరిస్తే జిల్లాలోని దాదాపు జిల్లాలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. రీ సర్వే కోసం ప్రతి మండలంలోని ఎంపిక చేసిన పైలట్ గ్రామాల సరిహద్దులు, ప్రభుత్వ భూములను ఈనెల 12లోగా ఖరారు చేయాలన్నారు. ఫ్రీహోల్డ్ భూముల వివరాలు రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు ఉన్నారు. ● జిల్లాలోని కొత్తగా నిర్మించిన గోకులాలను ఈనెల 10 నుంచి 12 మధ్య ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలోని ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని 981 గోకులాలను మంజూరు చేయడం జరిగిందని, నిర్మాణంలో ఉన్నవాటిని ఈనెలాఖరులోగా పూర్తి చేసి ప్రారంభించాలన్నారు.●మాతృశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టరు అంబేడ్కర్ హెచ్చరించారు. గత ఐదు మాసాల్లో జిల్లాలో జరిగిన మాతృ, శిశు మరణాలపై కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మాతా, శిశువుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, వివిధ శాఖల ఆధ్వర్యంలో విస్తృత స్థాయి యంత్రాంగం పనిచేస్తోందన్నారు. అయినప్పటికీ మరణాలు సంభవించడం బాధాకరమన్నారు సమావేశంలోని జిల్లా వైద్యాధికారి జీవనరాణి, డీసీహెచ్ఎస్ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయండి



మాట్లాడుతున్న మాణిక్యం ఠాకూర్

నెల్లిమర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అమానుషమని. ఆయనను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఏపీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్ అన్నారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానిస్తూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నవ సత్యాగ్రహం పేరుతో నెల్లిమర్లలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపాయి. స్థానిక రామతీర్థం జంక్షన్, ఇందిరా కాలనీలోని అంబేడ్కర్ విగ్రహాలకు పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ అధికార ప్రతినిధి మస్తాన్‌వలితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పకపోతే 26 నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గంటా సతీష్, ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు యడ్ల సతీష్, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు డాక్టర్ గేదెల తిరుపతి, డాక్టర్ చిత్రాడ దుర్గాప్రసాద్, ఓబీసీ జిల్లా చైర్మన్ తారకేశ్వరరావు, ఓబీసీ నియోజకవర్గ చైర్మన్ రాయల సురేష్, యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

మహిళా మార్ట్‌పై విచారణ చేపట్టండి



వివరాలు చూపుతున్న వెంకటరావు

శృంగవరపుకోట రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో వైసీపీ హయాంలో ఏర్పాటైన మహిళా మార్ట్‌లో అవినీతి జరిగిందనే అనుమానాలు ఉన్నాయని, జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని మండలంలోని వసి గ్రామానికి చెందిన కారుకొండ వెంకటరావు కోరారు. గురువారం ఆయన విలేకరులకు మాట్లాడుతూ తాను సమాచార హక్కు చట్టం ద్వారా మార్ట్‌కు సంబంధించిన వివరాలను సేకరించానన్నారు. 2022లో ఈ మార్ట్ ఏర్పాటుకు మండలంలోని 1412 సంఘాల్లో ఉన్న ఒక్కో సభ్యురాలి నుంచి రూ.300 చొప్పున వసూలు చేశారన్నారు. అలా రూ.46,60,220 సేకరించారన్నారు. మార్టులో పెట్టుబడి రూ.25,65,207 పెట్టుబడి పెట్టామని చెబుతున్నప్పటికీ ప్రస్తుతం మార్ట్‌లో రూ.14,44,009 విలువైన సరుకులు ఉన్నట్టు అధికారులు తనకు సమాచారం ఇచ్చారన్నారు. మార్ట్ నిర్వహిస్తున్న భవనానికి అద్దె, అందులో పనిచేస్తున్న వారికి జీతాలు లెక్క తేల్చినా ఇంకా రూ.8 లక్షలకు లెక్కలు లేవన్నారు. మార్ట్ సిబ్బంది గతంలో సరుకులు కొనుగోలు చేసేటప్పుడు చేతివాటం చూపించారని ఆరోపించారు. మార్ట్‌లో లాభాలను మహిళ సంఘాలకు ఇస్తామని గతంలో డీఆర్‌డీఏ అధికారులు ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి సైతం చెల్లించలేదన్నారు. ఈవిషయంపై ఏపీఎం ఎలమంచిలి రమణ వివరణ కోరగా ఏటా ఆడిటింగ్ జరుగుతుందని, ఎటువంటి లోపాలు గుర్తించలేదన్నారు. అయినప్పటికీ మరోసారి పరిశీలన చేస్తామన్నారు. రెండేళ్లుగా ఎందుకు సంఘాలకు లాభం పంచలేదనే మాటకు బదులిస్తూ వ్యాపారం పెద్దగా సాగడం లేదని, త్వరలో అన్ని సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సంప్రదాయాలను గుర్తు చేస్తూ ఫోర్టుసిటీ విద్యార్థుల ప్రదర్శన

విజయనగరం దాసన్నపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరలోని ఫోర్టుసిటీ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పండుగ ప్రాముఖ్యత, జరుపుకునే విధానాన్ని విద్యార్థులు నృత్యం, నాటిక రూపంలో ప్రదర్శించారు. హరిదాసు, సోదేమ్మ వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు, వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ రోహిణాఖాన్, డైరక్టర్లు మధు, అశోక్, నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●నెల్లిమర్ల: మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించారు. భోగి మంటలు వేశారు. ఆటపాటలతో సందడి చేశారు.



నెల్లిమర్ల: మోడల్ స్కూల్‌లో సంప్రదాయ దుస్తులతో వేడుకలు

సారాతో మహిళ అరెస్టు

కొత్తవలస, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామలింగపురం, ముసిరాం గ్రామాలలో గురువారం నిర్వహించిన దాడులలో 600 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు 5 లీటర్లు సారాతో ఓ మహిళను అరెస్టు చేశామని కొత్తవలస ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రామలింగపురం గ్రామ శివార్లలో దాడులు చేస్తుండగా గ్రామానికి చెందిన శిమ్మ వరలక్ష్మి 5 లీటర్ల సారాతో పట్టుబడిందన్నారు. అక్కడ నుంచి ముసిరాం పరిసర ప్రాంతాలలో నిర్వహించిన దాడుల్లో 600 లీటర్లు బెల్లం ఊటను గుర్తించి దాన్ని ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో సిబ్బంది ఎస్.రమ్యశ్రీ, వి.ఎస్.రాజు, టి.వీర్రాజు, బి.రాముడు, ప్రసాద్, బి.ఆదినారాయణ, జి.రమేష్ పాల్గొన్నారన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్కవరపుకోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల కనక (40) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సర్పంచ్ సత్యం తెలిపారు. కనక మంగళవారం గ్రామంలో కాలుజారి పడటంతో కననకు తలకు బలమైన గాయమైంది. విశాఖలోని కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించాడని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం

లక్కవరపుకోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగ గ్రామంలో సంక్రాంతి, గృహలింగేశ్వరస్వామి, మరిడిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా గురువారం మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఇందులో 40 జట్లు పాల్గొన్నట్టు సర్పంచ్ రావాడ నీలకంఠం తెలిపారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి గాయత్రి వెల్ఫేర్ అసోషియేషన్ రూ.10వేలు, మాజీ సర్పంచ్ యడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రావాడ ఈశ్వరరావు రెండో బహుమతి రూ.5వేలు, రావాడ బ్రదర్స్ రూ.3 వేలు బహుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇవి కాకుండా వ్యక్తిగత బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు బుల్లోడు, బి. రవిశంకర్, నెక్కల శంకర్ తెలిపారు.

బాక్సింగ్ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఇదే..

విజయనగరం టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటీ క్లబ్ హాల్‌లో గురువారం బాక్సింగ్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. బాక్సింగ్ జిల్లా అసోసియేషన్ చైర్మన్‌గా డోల మన్మథ కుమార్, అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఉప్పు ప్రకాశరావు, లింగం శరత్‌బాబు, జె.శేషగిరిరావు, జనరల్ సెక్రటరీగా ఇందుకూరి అశోక్ బాబు, ట్రెజరర్‌గా రాకేష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.ఈ.రాజు, జాయింట్ సెక్రటరీగా గుర్రపు రమణ, మహబూబ్ షరీఫ్, బి.మాధురిలతో పాటు ఐదుగురు ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు. సుమారు 200 మంది బాక్సింగ్ క్రీడాకారులు కార్యవర్గ ఎన్నికలో పాల్గొన్నారు.

విద్యార్థులకు దినచర్య పుస్తకాలు

రేగిడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో తునివాడ ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి వంజరాపు అవినాష్ ఔదార్యం చాటుకున్నారు. తన తండ్రి వంజరాపు సత్యం మాస్టారు జ్ఞాపకార్థం విద్యార్థులకు రూ.10 వేల విలువైన దినచర్య పుస్తకాలు సమకూర్చారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో వరప్రసాదరావు, అవినాష్ తల్లి వసుంధర పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకయ్య, కందిశ హెచ్‌ఎం ఎం.గణేష్, ఉపాధ్యాయులు త్రినాథరావు, బి.రాజాబాబు, ఎస్.విజయనిర్మల, సిహెచ్.నాగలక్ష్మి, బి.శైలజ, బలరాం పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించండి

మెంటాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కూనేరు పంచాయతీలోని ఎగువ మిర్తివలస, దిగువ మిర్తివలస, ఉద్దంగి పంచాయతీలోని కొత్తూరులో తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ కొండల నుంచి జాలువారిన నీటిని వడకట్టి గిరిజనులు తాగుతున్నారన్నారు. దీంతో అనారోగ్యం పాలై ఆర్థికంగా చితికిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల అనారోగ్యం పాలైతే ప్రాణసంకట స్థితిలో గిరిజనులు కొట్టుమిట్టాడుతున్నారన్నారు. తక్షణమే పాలకులు స్పందించి తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీపీ ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం



మేదర వీధిలో నిర్మాణమైన సీసీ రోడ్డు

రాజాం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని మేదరవీధి రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే ప్రజలు నరకయాతన పడేవారు. అయితే ఈ రహదారిలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ క్యాంపు కార్యాలయం ఉండటంతో మున్సిపల్ అధికారులు సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇందుకుగానూ రూ 11.40 లక్షలు వెచ్చించారు. దీంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డోలపేట విద్యార్థులు



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాజాం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీల్లో డోలపేట ఉన్నత పాఠశాలకు చెందిన కె.ఉష, వి.స్వాతి, టి.లత, కె.హాసిని, ఎం.శ్రీతి పాల్గొన్నారని పీడీ రేణుకాదేవి తెలిపారు. ఒకేసారి ఐదుగురు అమ్మాయిలు క్రికెట్ పోటీల్లో పాల్గొనడంపై హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని అభినందించారు.

రేషన్ డిపోను ఎస్సీలకు కేటాయించండి

రేగిడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరాడలో రెండో రేషన్ డిపోను ఎస్సీలకు కేటాయించాలని దళిత జేఏసీ మండల అధ్యక్షుడు తేగల మోహనరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కేత శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం బూరాడలో దళితులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో బీసీల తర్వాత అత్యధిక జనాభా మా సామాజిక వర్గానిదేనన్నారు. ఇటీవల రెండో రేషన్ డిపో నోటిఫికేషన్ భర్తీలో ఈడబ్ల్యూఎస్‌కు కేటాయించి అధికారులు తప్పు చేశారన్నారు. ఇప్పటికే ఒకటో డిపో బీసీ వ్యక్తి నిర్వహిస్తున్నారని, రెండో డిపోను రోస్టర్ ప్రాప్తికి ఎస్సీలకు కేటాయించాలన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు, కలెక్టర్ అంబేడ్కర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

అన్న క్యాంటీన్‌కు స్థల సేకరణ

గజపతినగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గజపతినగరంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అధికారులు స్థల సేకరణ చేపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసి నిరుపేదలకు రూ.5లకు భోజన సదుపాయం కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ప్రాప్తికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి గజపతినగరంలో స్థల సేకరణ చేపడుతున్నామని ఎంపీడీవో బి.కల్యాణి గురువారం తెలిపారు.

గిరిజన విద్యాశాఖ డీడీగా కృష్ణవేణి



కృష్ణవేణిని అభినందిస్తున్న ఉద్యోగులు

పార్వతీపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కృష్ణవేణి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె సాలూరు ఏటీడబ్ల్యూవోగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. తాజాగా ఇన్‌చార్జి డీడీగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె గురువారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన విద్య, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణవేణిని పలువురు అభినందించారు.

సమయ పాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి

సీతంపేట రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి అన్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని దోనుబాయి పీహెచ్‌సీని ఆమె గురువారం పరిశీలించారు. ఓపీ, వైద్య సిబ్బంది సమయపాలన వంటి అంశాలపై వివరాలను అడిగి తెలుసుకు న్నారు. మందులు అందుబాటులో ఉంచుకో వాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్‌కు ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎల్‌టీ వసంత ఉన్నారు.

సారాతో మహిళ అరెస్టు

సీతంపేట రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామంలోని పెద్దూరు రోడ్డులో అక్రమంగా సారా విక్రయిస్తున్న రంగోళి రాములమ్మ అనే మహిళను పట్టుకుని అరెస్టు చేశామని స్థానిక ఎస్‌ఐ వై.అమ్మన్నరావు గురువారం తెలిపారు. పోలీస్ సిబ్బంది చేసిన తనిఖీల్లో 20 లీటర్ల సారా విక్రయిస్తూ రాములమ్మ అనే మహిళ పట్టుబడిందని చెప్పారు. కేసు నమోదు చేసి, నిందితురాలిని రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

సామాజిక తనిఖీ బృందం పర్యవేక్షణ



రికార్డులు తనిఖీ చేస్తున్న బృందం

మక్కువ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ములక్కాయవలస ఆదర్శ పాఠశాల, కాశీపట్నం కేజీబీవీలో సామాజిక తనిఖీ బృందం గురువారం పర్యటించింది. పాఠశాలలో ల్యాబ్‌లు, వసతిగృహం రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. బోధనా విధానం, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బృందం స్టేట్ రిసోర్స్ పర్సన్ బి.దాసు, జిల్లా రిసోర్స్ పర్సన్లు ఎస్.వెంకటేశ్వర్లు, శివ, వరహామూర్తి, సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఎన్.స్వర్ణలత, జి.నాగదుర్గ, ఎస్ఎంసీ చైర్మన్ శిష్టుభారతి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పనులు చేపట్టాలి

గరుగుబిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో నూతనంగా విధించిన నిబంధనల మేరకు క్షేత్ర స్థాయిలో పనులు నిర్వహించకుంటే చర్యలు తప్పవని ఉపాధి హామీ సహాయ పథక సంచాలకుడు గుంట్రెడ్డి శ్రీహరి హెచ్చరించారు. గురువారం గిజబ గ్రామంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా చేసిన పనులనే తిరిగి నిర్వహిస్తే తొలగింపు తప్పదని హెచ్చరించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎం.గౌరీనాథ్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో సంఘం ఉపాధ్యక్షుడిగా రవీంద్రకుమార్

పాలకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో సంఘం పాలకొండ ఉపాధ్యక్షుడిగా ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు జె.రవీంద్రకుమార్‌ను కో-ఆప్షన్ ద్వారా ఎన్నుకున్నారు. గురువారం పాలకొండలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా ఉపాధ్యక్షుడు జానకిరాం, జిల్లా కోశాధికారి పూర్ణచందరరావు, పాలకొండ యూనిట్ గౌరవాధ్యక్షుడు లిల్లీ పుష్పనాథం, అధ్యక్షుడు కె.రంగాచారి, ప్రధాన కార్యదర్శి పైల ఈశ్వరరావు, రెవెన్యూ సంఘ కార్యదర్శి డీటీ సన్యాసిరావు, ఉపాధ్యక్షులు జి.నాయుడు, రాజులమ్మ, సంఘ సభ్యుడు రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా అసంపూర్తిగానే..

- దిష్టి బొమ్మల్లా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం
- చాలా చోట్ల అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

రామభద్రపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో 2017లో మంజూరైన అంగన్‌వాడీ భవనాలు ఇప్పటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాలు, పంచాయతీ కార్యాలయాల్లో నడుపుతున్నారు. ఈ అసంపూర్తిగా ఉన్న భవనాలకు కొద్దిపాటి నిధులను వెచ్చిస్తే పనులు పూర్తయిపోతాయి. అయినప్పటికీ ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదు. సుమారు ఏడేళ్లయినా ఈ భవనాల వైపు కన్నెత్తి చూడకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టని పలువురు భావిస్తున్నారు. మండలంలో 64 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 34 భవనాలు అద్దె కొంపలో కొనసాగుతున్నాయి. మిగిలిన భవనాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. నర్సాపురం, పాతరేగ, కొండకెంగువ, కొట్టక్కి, అప్పలరాజుపేట తదితర గ్రామాల్లో గతంలో మంజూరైన ఈ భవనాలు ఫినిషింగ్ పనులు చేయకపోవడంతో మిగిలిపోయాయి. కొద్దిపాటి నిధులు వెచ్చిస్తే ఈ భవనాలు ప్రారంభోత్సవా నికి నోచుకుంటాయని నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు తెలిపారు.



నర్సాపురంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

అయినప్పటికీ సంబంధిత శాఖాధికారులు వీటిపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో తెలియడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. అలాగే ప్రతి మండల సర్వసభ్య సమావేశాల్లోను ఈ అసంపూర్తి భవనాలపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీస్తున్నా ఉపయోగం లేకపోతోంది. మరికొన్ని గ్రామాల్లో అద్దెకు ఇచ్చిన అంగన్‌వాడీ కేంద్రాల యజమా నులు తమ ఇళ్లు ఖాళీ చేయాలని నిర్వాహకులపై ఒత్తిడి చేయడం, మరికొన్ని భవనాలు శిథిలావస్థకు చేరడంతో అంగన్‌వాడీ భవనాలు సతమతమవుతున్నాయి.

భవనాలు పూర్తి చేస్తాం

దీనిపై ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మిని వివరణ కోరగా అసంపూర్తి భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మరికొన్ని భవనాలకు ప్రతిపాదన కూడా పంపించామని తెలిపారు.

పంట మార్పిడిపై దృష్టి సారించండి

గరుగుబిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు సూచించారు. పిట్టలమెట్ట గ్రామంలో రబీ పంటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సమయంలో వరి సాగు తదుపరి రబీలో పెసర 80 శాతం, 20 శాతం అంతర్ పంటలైన కొమ్ముశనగ, తోటకూర, గోంగూర, కట్టె జనము, ముల్లంగి, బెండ, తదితర రకాలు వేసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దత్తి వెంకటనాయుడు, ఆర్.లక్ష్మంనాయుడు ఉన్నారు.

12న జట్టు ఆశ్రమంలో యువజనోత్సవాలు

పార్వతీపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలోని జట్టు ఆశ్రమంలో ఈనెల 12న యువజన ఉత్సవాలు నిర్వహిస్తామని పార్వతీపురం స్వచ్ఛ సుందర జిల్లా సమన్వయకర్త బి.రామగోపాల్ తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన స్వచ్ఛ సుందర పార్వతీపురం అంశాలకు సంబంధించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు కలెక్టర్ చేతులమీదుగా ప్రదానం చేస్తామని తెలిపారు.

పారిశుధ్య సిబ్బందికి సేఫ్టీ కిట్లు

పాలకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని పారిశుధ్య సిబ్బందికి నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాపరావు, కమిషనర్ సామంచి సర్వేశ్వరరావులు గురువారం సేఫ్టీ కిట్లు అందించారు. పట్టణంలోని సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ కోసం వెళ్లే ఎంపిక చేసిన సిబ్బందికి ప్రభుత్వం నుంచి వచ్చిన గ్లౌజులు, మాస్కులు, షూ తదితర సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కిల్లారి మోహన్‌రావు, కడగల వెంకటరమణ, తూముల లక్ష్మణ, పడాల రాంబాబు తదితరులు ఉన్నారు.

చేపల పెంపకంతో ఉపయోగం

వీరఘట్టం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారి, ఎఫ్‌పీవో అధ్యక్షుడు కె.చిన్నమనాయుడు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం కె.రాము మాట్లాడుతూ ఐఎఫ్‌సీ విధానంలో చేపల పెంపకం చేపడితే సంవత్సరానికి మూడు పంటలు వస్తాయని, దీనివల్ల రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. ఒక ఎకరం పొలం ఉన్న రైతులు నీరు ఉన్న ప్రాంతంలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సమీకృత వ్యవసాయ విధాన పరిధి పథకంలో మండలంలోని చలివేంద్రాన్ని ఎంపిక చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవోసీసీ ఆనందరావు, మండల సమైఖ్య సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

పాలకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈనెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని, గురువారం ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్కృత పండితులు బౌరోతు శంకరరావు, దన్నాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు.

పోరాటానికి సిద్ధం కండి



కొండలోయ గెడ్డ వద్ద మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

భామిని, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతులు సంఘాలుగా ఏర్పడి పోరాటానికి సిద్ధమైతే భామిని మండలంలో సాగునీటి ఇబ్బందులను పరిష్కరించుకోవచ్చునని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వర్ అన్నారు. గురువారం భామినిలో ఆయన మండల రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై ఆరా తీశారు. అనావృష్ట, అతివృష్టితో నష్టపోతున్నామని రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన భామిని మండలంలో గతంలో మంజూరై నిలిచిపోయిన ప్రాజెక్టులను సందర్శించారు. అర్ధాంతరంగా నిలిచిన కొండలోయగెడ్డ, వడ్డంగి, మనుమకొండ ఎత్తిపోతల పథకం, మనకు జోడి మామిడి చెరువు, వంశధార ఓపెన్ హెడ్‌ఛానల్ సందర్శించారు. ఆయతో పాటు రైతు సంఘ జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని సూచిస్తున్న ఈవోపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అనుమతులు లేకుండా అనధికార నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు హెచ్చరించారు. తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించారు. దేవస్థానం పరిధిలో ఆక్రమణలపై ఇటీవల ఆలయ అభివృద్ధి సేవ ట్రస్టు ప్రతినిధులు డి.పారినాయుడు, ఎం.పకీరునాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీపీవో ఆదేశాలతో ఆయన దేవస్థానం ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడ పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్టు గుర్తించి, పనులను నిలుపుదల చేశారు. ఈ పరిశీలనలో కార్యదర్శి ఎ.లలితకుమారి, వీఆర్వో టి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టును ఆశ్రయించిన పింఛన్‌దారులు

గరుగుబిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్ల పరిశీలన ఒకవైపు జరుగుతుండగా, మరోవైపు పలువురు పింఛన్‌దారులు పింఛన్ల నిలుపుదలపై కోర్టును ఆశ్రయించారు. మండలంలోని బీవీ పురం, ఉద్దవోలు పంచాయతీలకు సంబంధించి అనర్హులు పింఛన్లు పొందుతున్నారని పలువురు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో జి.పైడితల్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికలను ఉన్నతాధికారులకు నివేదించారు. ఇదిలాఉండగా ఈనెల 7న మండలంలోని ఐదు పంచాయతీల్లో ప్రత్యేక వైద్య బృందం పర్యటించి వికలాంగ పింఛన్లను తనిఖీ చేసింది. ప్రస్తుతం బీవీ పురంలో వికలాంగ పింఛన్లు 85, ఓఏపీ పింఛన్లు 72, అలాగే ఉద్దవోలులో వికలాంగ పింఛన్లు 49, ఓఏపీ పింఛన్లు 16 ఉన్నాయి. మొత్తంపై రెండు పంచాయతీల్లో 230 పింఛన్‌దారులు ఉన్నారు. అయితే సామాజిక తనిఖీల్లో పింఛన్‌దారుల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో బృందం తనిఖీ చేసి అధికారులకు నివేదికలు అందించింది. ఇందులో సదరం ధ్రువీకరణ కోసం వైద్య బృందానికి సమాచారం అందించారు. ఈక్రమంలో మండలంలో వైద్య బృందం నిర్వహించిన తనిఖీల్లో 38 మందికి పైగా అనర్హులు ఉన్నట్లు గుర్తించారు. ఈనేపథ్యంలో బీవీ పురం గ్రామానికి చెందిన సుమారు 29 మంది.. గతంలో తమకు పింఛన్లు మంజూరు చేశారని, ప్రస్తుతం పలు కారణాలతో నిలుపుదల చేస్తున్నారని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు నుంచి గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి పూర్తి నివేదిక అందించాలని సమాచారం అందింది.

నిబంధలను విరుద్ధంగా ఉంటే తొలగింపు తప్పదు

దీనిపై ఎంపీడీవో పైడితల్లి స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవహరిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండే పింఛన్ల తొలగింపు తప్పదన్నారు. పింఛన్‌దారుల సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు
- గర్భిణులకు 'ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' తనిఖీలు

కొమరాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని కేఆర్‌బీ పురం పీహెచ్‌సీలో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అప్పుడే ఫీడర్ అంబులెన్స్ వాహనంలో ఇంటికి బయలుదేరుతున్న గర్భిణితో ఆయన మాట్లాడి ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో ఆరోగ్య తనిఖీలను, మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించారు. రక్తహీనత గుర్తించిన గర్భిణుల్లో నెల నెలా హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని, ఎనీమియా యాక్షన్ కమిటీలు పక్కగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రసవ సమయం నాటికి రక్తహీనత ఉండరాదన్నారు. గర్భిణుల్లో జ్వర లక్షణాలను గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి, తక్షణమే పరీక్షలు జరపాలన్నారు. ఈ సందర్భంగా పీఎంఎస్ఎంఏలో గర్భిణులకు అక్కడ పోషకాహారం అందజేసిన సత్యసాయి ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు టి.గణేష్ పట్నాయక్, ఆరోగ్యశాఖ డెమో యేగీశ్వరరెడ్డి, ఎస్‌యూవో ధనుంజయరావు, సూపర్‌వైజర్లు శోభ, శారద, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: గర్భిణుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకుంటున్న జగన్మోహనరావు

గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి

కురుపాం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు తమ ఆరోగ్యం పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలంటూ నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అమర సింహారెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నీలకంఠాపురం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన గర్భిణులకు పలు సూచనలు చేశారు. రక్తహీనత రాకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసిన పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. హైరిస్క్ కేసులను ముందుగా గుర్తించి వారికి తగు సూచనలు, సలహాలు చేయాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీహరిరావు, రాజులమ్మ పాల్గొన్నారు.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

సీతానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఉషా, పి.పావనిలు సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో వారి సమక్షంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్న ప్రసాద వితరణ

జియ్యమ్మవలస, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జియ్య మ్మవలస పీహెచ్‌సీ వద్ద 60 మంది గర్భిణులకు సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం ప్రేమామృత ప్రసాదాన్ని అందజేశారు. శిఖబడి గ్రామా నికి చెందిన ఉపాధ్యాయుడు రాయగడ లక్ష్మణరావు ఈ ప్రసాదం అందించడానికి తగు మెటీరియల్ వితరణ చేశారని జియ్యమ్మవలస సత్యసాయి భజన మండలి కన్వీనర్ కోలక నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పూలబంతి జగదీష్, వైద్య సిబ్బంది, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

- మక్కువ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శంబర పీహెచ్‌సీ ఆవరణలో గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పెంట సత్యనారాయణ పాల్గొని, సత్యసాయి సేవా సమితి సభ్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: అన్న ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

పార్వతీపురంటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకృష్ణా పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను ముగ్గులతో అలంకరించారు. భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

న్యూస్ బాక్స్

సంక్రాంతి సంబరాల ఏర్పాట్లు పరిశీలన

పార్వతీపురంటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సంక్రాంతి సంబరాల్లో పాల్గొనాలని కోరారు. క్రీడా మైదానాన్ని శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీరురాజును ఆదేశించారు.

పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వద్దు

గరుగుబిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు హెచ్చరించారు. తోటపల్లి గ్రామ పరిసరాలను ఆయన గురువారం పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ పరిశీలనలో కార్యదర్శులు ఎ.లలితకుమారి, ఎన్.రవికుమార్ పాల్గొన్నారు.

చినమేరంగి కళాశాలలో సైన్స్ ఫెయిర్

జియ్యమ్మవలస, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సవరపు రవణ పర్యవేక్షణలో గురువారం సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించారు. చినమేరంగి, జియ్యమ్మవలస, పెదమేరంగి, పిప్పలభద్ర, బీజే పురం ఉన్నత పాఠశాలల నుంచి 9, 10 తరగతుల విద్యార్థులు వచ్చి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ముదిలి శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

గరుగుబిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చిలకాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంక్రాంతిని పురస్కరించుకుని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు కంచుమోజు రామ్‌మోహన్ రావు గురువారం పుస్తకాలు, పెన్నులు, దుస్తులు పంపిణీ చేశారు. హెచ్ఎం మర్రాపు మహేష్ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

గరుగుబిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శివ్వాం గ్రామంలో శుక్రవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి రహదారి ప్రారంభోత్సవాన్ని చేయనున్నారని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రహదారి ప్రారంభోత్సవంతో పాటు ఉపాధి నిధులతో నిర్మాణం చేపట్టిన గోశాలలు ప్రారంభిస్తారని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం

పాలకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా నగర పంచాయతీ సిబ్బంది పనిచేయాలని నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు సూచించారు. గురువారం ఆయన పాలకొండలోని పలు వార్డుల్లో పర్యటించారు. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. కార్మికుల హాజరుపై ఆరా తీశారు.

పేకాట శిబిరంపై దాడి

కొమరాడ, జనవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలో గుంప ఆలయ సమీపంలో గురువారం పేకాట శిబిరంపై జరిపిన దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ నీలకంఠం తెలిపారు. వారి వద్ద నుంచి లక్షా 63వేల 170 నగదుతోపాటు 8 బైకులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

అంచనా బడ్జెట్ ఆమోదం

పాలకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ పల్లా ప్రతాప్ ఆధ్వర్యంలో గురువారం అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు ఐదు కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. ఈసందర్భంగా నగర పంచాయతీ సిబ్బంది, మెప్మా సిబ్బంది హాజరు కాకపోవడం పట్ల కౌన్సిలర్ వెలమల మన్మథరావు తదితరులు ఆక్షేపించారు. బడ్జెట్ సమావేశానికి డుమ్మా కొడుతున్నారని, ఇది తగదన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ సర్వేశ్వరరావు భవిష్యత్తు సమావేశాలకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. కేంద్ర గ్రంథాలయ నిర్వహణ పరమ అధ్వాన్నంగా ఉందని పలువురు ప్రస్తావించారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయ సక్రమ నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు.